
సాక్షి ఏలూరు

మంగళవారం । 7 । మే । 2024



తెలంగాణ మద్యం పట్టివేత

నూజివీడు మండలంలోని సుంకొల్లు గ్రామంలో ఎస్‌ఈబీ అధికారులు భారీగా తెలంగాణ మద్యాన్ని పట్టుకున్నారు. 8లో ▸



టీడీపీ, జనసేనకు గుడ్‌బై

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



చదువుకు చేయూత

ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చేయూత అందిస్తామని స్పృహ ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం



ఉత్సవాన్ని జరిపిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞశాలలో హోమాది కార్యక్రమాలను జరిపారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణల అనంతరం శ్రీ పుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో జరిపించారు.

93 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ

ఏలూరు(మెట్రో): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 93 శాతం ఓటర్లకు ఓటరు స్లిప్పులు (ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పు) పంపిణీ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో 16,37,430 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 15,21,928 మంది ఓటర్లకు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్లిప్పులు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో 2,06,437 మందికి 2,03,658, చింతలపూడిలో 2,73,069 మందికి 2,63,537, పోలవరంలో2,53,981 మందికి 2,39,876, ఏలూరులో 2,35,345 మందికి 2,21,324, నూజివీడులో 2,38,981 మందికి 2,22,381, కైకలూరులో 2,05,604 మందికి 1,87,784, దెందులూరులో 2,24,013 మందికి 1,83,368 ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా పోలింగ్ స్టేషన్, రాష్ట్రం, జిల్లా పేరు, నంబరు, హెల్ప్‌లైన్ నంబర్ వంటి ముఖ్యమైన సమాచారం పొందవచ్చన్నారు.

రూ.238.22 కోట్ల ధాన్యం సొమ్ముల చెల్లింపు

ఏలూరు(మెట్రో): జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 2.40 లక్షల టన్నుల ధాన్యానికి గాను ఇప్పటివరకు 1,97,852 టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నమోదు చేసుకున్నారని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. దీనిలో భాగంగా 1,79,530 టన్నుల ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు అనుసంధానం చేశామన్నారు. రైతులకు ధాన్యం సొమ్ముల నిమిత్తం రూ.359.83 కోట్లకు గాను రూ.238.22 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు జమచేశామన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో మిగిలిన 172 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు.

ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): జిల్లాలో మంగళ, బుధవారాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల కోసం ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్‌కు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుచేసినట్టు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో ఓటు కలిగి ఏ ప్రాంతంలో ఎన్నికల విధుల్లో ఉన్నా ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని చెప్పారు.

జిల్లాకు 359 బ్యాలెట్లు : ఎన్నికల విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి సంబంధించి ఇతర జిల్లాల నుంచి 359 పోస్టల్ బ్యాలెట్‌లు రప్పించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సంబంధిత పోలీస్ సిబ్బంది మంగళవారం ఏలూరు కోటదిబ్బలోని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

ప్రశాంతంగా ఐసెట్

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్, శ్రీవిష్ణు, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సోమవారం ఏపీ ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మూడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 800 మందికి గాను 51 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 142 మంది, మధ్యాహ్నం 150 మందికి 142 మంది హాజరయ్యారు. శ్రీవిష్ణు కళాశాలలో ఉదయం 100 మందికి 95 మంది, మధ్యాహ్నం 100 మందికి 88 మంది హాజరయ్యారు. డీఎన్నార్ కళాశాలలో ఉదయం 150 మందికి 144 మంది, మధ్యాహ్నం 150 మందికి 138 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షలు ప్రశాంతం జరిగాయి.

కైకలూరుకు కమలం పువ్వు నేత కామినేని ఒక రాజు.. నలుగురు సైకిల్ నేతలు సామంతరాజులు.. గతంలో ఎమ్మెల్యేగా గెలిచీ గెలవగానే మొదటి వారంలోనే సామంతరాజులను నియమించడం.. విభాగాల వారీగా సెటిల్‌మెంట్‌లను అప్పగించడం.. అందినంత సామంతరాజులు దండుకుని అసలు రాజుకు కప్పం చెల్లించడం 2014–19లో కైకలూరు నియోజకవర్గంలో ఉన్న పరిస్థితి. చిన్నపాటి స్థల వివాదం మొదలు కొల్లేరు అభయారణ్యం విధ్వంసం అన్నీ వీరి కన్నుసన్నల్లోనే సాగాయి. ఇక కైకలూరులో బీజేపీ నేతలు పలువురు ఉన్నా కామినేనితో ఎవరికీ సంబంధమే లేదు. ఎందుకంటే ఆయన టీడీపీ, బీజేపీ నేత. మరో విశేషమేమిటంటే నలుగురు సామంతరాజులు కూడా కామినేని సొంత సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం.

కామినేని.. అందిన కాడికి దండుకుని!



లీలు, రోజువారీ పంచాయితీలు, భూదందాలు పోలీసుల ద్వారా బెదిరింపుల రాజకీయాలన్నీ ఈ నలుగురి కన్నుసన్నల్లోనే సాగాయి. భారీగా ఆదాయం పొందడంతో పాటు కమలం నేతలను నాలుగు మండలాల్లో పూర్తి నిర్వీర్యం చేసి కామినేని కన్నుసన్నల్లో టీడీపీ నేతలు దండుకున్నారు. ప్రధానంగా మండవల్లి, కైకలూరులోని కొల్లేరు అభయారణ్యంలో వందల ఎకరాల్లో అక్రమ చేపల సాగు పెద్ద ఎత్తున నిర్వహించి కోట్లు గడించి అందరూ పంచుకున్నారనేది నియోజకవర్గంలో బహిరంగ టాక్. అదే సదరు నేతల వ్యక్తిగత ముఠాలకు లబ్ధి చేకూర్చేలా ఐస్ ఫ్యాక్టరీల సబ్సిడీల్లోనూ భారీగా స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఏలూరు మండలంలోని కోమటిలంకలో అక్రమ చేపల సాగు రవాణా కోసం లంకలో చిన్నపాటి రహదారి వేయించిన పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎన్నికల సమయంలో కూటమిలో పొత్తులు ఉదయిస్తేనే కూటమి స్టార్‌గా ఈ వృద్ధ నేత తెరమీదకు వస్తారు. కూటమి రెండు నెలల్లో ఖరారవుతుందనగా కమలం కండువా వేసుకుని కైకలూరులో వాలిపోతారు. ఒకవేళ కూటమి లేదంటే సున్నితంగా అక్కడ నుంచి జారుకుంటారు. 2014లో కూటమి పొత్తు ఖరారు కావడంతో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పెద్దాయన ఆశీస్సులు, బడాబడా పరిచయాలు ఉండటంతో గెలిచిన వెంటనే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పట్టం కట్టారు. కట్ చేస్తే.. 2019లో కూటమిలో తీవ్ర విభేదాలతో పొత్తు ఉదయించలేదు. దీంతో కైకలూరుకు, తనకు ఏమీ సంబంధం లేదని, హైదరాబాద్, విదేశాలకు పరిమితమయ్యారు. కమలం పువ్వు పార్టీ కనీసం పోటీ చేసి బరిలో నిలిచామన్న పరువు కోసం కీర్తి వెంకటరామ్‌ప్రసాద్‌ను అభ్యర్థిగా నిలిపింది. మళ్లీ 2024లో పొత్తు ఖరారు కావడంతో సీటు రిజర్వేషన్ చేసుకున్నాను.. తనదే నంటూ కామినేని టికెట్ తెచ్చుకుని డబ్బు రాజకీయానికి మళ్లీ తెరలేపి అసలు బీజేపీ నేతలను అణగదొక్కేశారు. అలాగే మంత్రిగా ఆ శాఖకు సంబంధించి ఏమీ చేయలేదు. ఇక నియోజకవర్గం సంగతి దేవుడెరుగు. అభివృద్ధి లేకపోగా విచ్చలవిడిగా అవినీతి, సొంత సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యమివ్వడం, బీసీ నేతలను, నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న సామాజిక వర్గాన్ని విస్మరించడంతో పాటు ఇబ్బంది పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

పొత్తు పొడిస్తేనే పోటీలో..

- పేరుకే బీజేపీ.. పెత్తనమంతా టీడీపీదే..
- నలుగురు టీడీపీ నేతల కనుసన్నల్లో వ్యవహారాలు
- అక్రమ చెరువులతో కొల్లేరు విధ్వంసం
- వ్యక్తిగత లాభం కోసం బైపాస్ అలైన్‌మెంట్ మార్పు
- సింగిల్ టెండర్లతో అన్ని పనుల్లోనూ ప్రత్యక్ష లబ్ధి
- కైకలూరు బీజేపీ అభ్యర్థి చరిత్ర

సామంతరాజుల దందా

2014–19లో సామంతరాజుల దందాలకు కైకలూరు హడలెత్తిపోయింది. కలిదిండి మండల వ్యవహారాలన్నీ కామినేని సొంత మనిషి, టీడీపీ నేత వల్లభనేని శ్రీనివాసచౌదరి, మండవల్లి వ్యవహారాలన్నీ చాపరాల దుర్గాప్రసాద్, ముదినేపల్లి పంచాయితీలు యేర్నేని కిషోర్, కైకలూరు పంచాయితీలు ఏఈ శ్రీనివాస్ కన్నుసన్నల్లోనే జరిగేవి. నలుగురికి అనధికారికంగా సర్వఅధికారాలు ఇచ్చి రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖపై పెత్తనాలు ధారాదత్తం చేశారు. పర్యవసానంగా తహసీల్దార్, ఎస్ఐ, సీఐ, రెవెన్యూ, పోలీస్ శాఖలో, ఇతర ఉద్యోగుల బది

గ్రేటర్ కమ్యూనిటీలో..

కైకలూరులో ఓ గ్రేటర్ కమ్యూనిటీలో 27 ఎకరాల స్థలాన్ని 11 ఎకరాల మేర ఆయన సన్నిహితుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అనుమతులు కోసం పంచాయతీ బోర్డును ఆక్రమించడం, నిబంధనలకు పూర్తి విరుద్ధంగా పది ఎకరాల మేర చేపల చెరువు, నాలా నిబంధనలకు విరుద్ధంగా పూడ్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. కైకలూరు మీదుగా మంజూరైన బైపాస్ సెక్షన్‌ను సొంత వారికి లబ్ధి చేకూర్చాలని అలైన్‌మెంట్ మార్పు చేశారు. దీంతో భూముల ధరలు పెరిగి కావాల్సిన వారికి లబ్ధి చేకూర్చారు. అన్ని సింగిల్ టెండర్లతో పనులు ఖరారు చేసి నాసిరకం మెటీరియల్ వాడి అనుచరగణానికి భారీగా లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు ఉన్నాయి.

కట్టుదిట్టంగా ఈవీఎంల కమిషనింగ్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



చింతలపూడిలో కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

చింతలపూడి: జిల్లావ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో ఈవీఎంల కమిషనింగ్ చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం చింతలపూడి వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్‌లో నిర్వహిస్తున్న చింతలపూడి అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. మంగళవారం కూడా త్వరగా ప్రక్రియ ప్రారంభించి పూర్తిచేయాలని ఆర్వో, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్యను ఆదేశించారు. ప్రక్రియలో లోపాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, సాంకేతిక సమస్యలొస్తే సంబంధిత టెక్నీషియన్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఏఆర్‌ఓ కె.స్లీవజోజి, డ్వామా పీడీ ఎ.రాము ఉన్నారు.

నిబంధనల మేరకు.. ఎన్నికల సంఘ నిబంధనల మేరకు ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఏ రామన్ అన్నారు. మార్కెట్ యార్డు స్ట్రాంగ్‌రూమ్‌లో చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 273 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

జాగ్రత్తగా నిర్వహించాలి

ఏలూరు(మెట్రో): ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన 213 పోలింగ్ కేంద్రాల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్ట్రాంగ్‌రూమ్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

మా సహనాన్ని పరీక్షిస్తే ఊరుకోం

ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నీతి, నిజాయితీలతో కూడిన రాజకీయాలు చేయాలని మాత్రమే మా నాయకుడు జగన్ మాకు నేర్పారు.. మా సహనాన్ని పరీక్షిస్తే మీరు రోడ్లపై తిరగలేరు అని.. వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ టీడీపీ నాయకులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. సోమవారం ఉదయం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం తాము ఎన్నికల ప్రచారం శాంతియుత వాతావరణంలో చేసుకుంటున్నామని, జంగారెడ్డిగూడెంలో తమ ప్రచారం సాగుతుండగా నూజివీడులో సుమారు 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నాయని సమాచారం అందడంతో నూజివీడు వెళ్లేందుకు బయలుదేరామన్నారు. ఈ క్రమంలో తాము రంగాపురం చేరుకునే సమయానికి టీడీపీ వారి ప్రచారం జరుగుతోందని, అది గమనించి తాము మరో మార్గంలో వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా టీడీపీ మూకలు తమ కాన్వాయ్‌లోని కార్లను కర్రలు, రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ తమ నాయకుడు నేర్పిన ఓర్పు, సహనంతో వ్యవహరిస్తుండగా టీడీపీ నాయకులు తమ కార్యకర్తలను రెచ్చగొట్టి నీచ రాజకీయాలు చేయడానికి, అరాచకం సృష్టించడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. చదువుకున్న వాడిగా శాంతియుతంగా ఆలోచిస్తున్నానని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదనేదే తమ ప్రయత్నమన్నారు. తిరగబడటానికి, దాడులు చేయడానికి తమకు నిమిషం పట్టదని, ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇదే తమ ఆఖరి హెచ్చరిక అని, ఇకపై సహనాన్ని పక్కన పెడతామని స్పష్టం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

రంగాపురంలో దాడి ఉదంతంపై కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామని, టీడీపీ నాయకులు ప్రోత్సహిస్తున్న నీచ రాజకీయాలు, దాడి సంస్కృతిపై వారు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రశాంతమైన జిల్లాలో ఇటువంటి అలజడి సృష్టించడానికి అరాచక శక్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. టీడీపీ నాయకుల దాడుల్లో పలువురు అమాయకులు గాయాలపాలవుతున్నారని, ఇకపై అటువంటివి మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మేము ఎవరినీ రెచ్చగొట్టమని, తమ పని తాము చేసుకుపోతామని, తమను రెచ్చగొడితే ఖబడ్దార్ ఎంతకైనా తెగిస్తామని, ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని, తమ కార్యకర్తలు ఇప్పటికే ఆవేశంతో రగిలిపోతున్నారని, వారిని తాను వారిస్తున్నానని, ఇటువంటివి పునరావృతమైతే వారిని నిలువరించడం తన వల్ల కూడా కాదని సునీల్‌కుమార్ స్పష్టం చేశారు.

సునీల్‌పై దాడి హేయం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్యగా జిల్లా యాదవ సంఘం నాయకులు ముక్తకంఠంతో ఖండించారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు దాడిని ఖండించారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, కోశాధికారి గొర్ల రామారావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్ల మనసును గెలుచుకుని ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేయాలే తప్ప ఇలాంటి భౌతిక దాడులకు దిగడం సిగ్గు చేటన్నారు. నాయకులు పాయల హనుమంతరావు, నాగనబోయిన ఉయ్యూరు. ఆకుల గంగాధరరావు, చిట్టియిన సాయిబాబు, పుసునూరి ప్రభు,సప్పా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుణపాఠం తప్పదు

ఎన్నికల ప్రచారానికి వెళుతున్న ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అడ్డుకుని కారు అద్దాలు ధ్వంసం చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ గూండాలకు తగిన గుణపాఠం చెబుతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సునీల్‌కుమార్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

20 రోజులు.. రూ.1.87 కోట్లు

చిన వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం లెక్కించారు. శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత 20 రోజులకు గాను నగదు రూపేణా రూ.1,87,54,150 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపంలో 241 గ్రాముల బంగారం, 6.410 కేజీల వెండితో పాటు విదేశీ కరెన్సీ యుఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ డాలర్లు 56, ఇంగ్లాండ్ పౌండ్స్ 2, అరబ్ ఎమిరటీస్ దీరమ్స్ 5, సౌదీ అరేబియన్ రియాల్స్ 4, కువైట్ దినార్ 1 లభించాయన్నారు. అలాగే రద్దయిన పాత రూ.2 వేలు, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.31,500 లభించాయన్నారు. ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాపులకు మేలు చేసింది సీఎం జగనే



ఉనికెల శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులాలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరే మేలు చేశారని యునైటెడ్ కాపు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఉనికెల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)కి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులకు మేలు చేసే విధంగా కాపు నేస్తం పథకాన్ని కొనసాగిస్తూ 2024 మేనిఫెస్టోలో సీఎం జగన్ హామీ ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విజయీభవ

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ.. రానున్న ఐదేళ్లలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి చేయనున్న పనులను తెలియజేస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. వీరికి అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మేమంతా జగన్ వెంటే అంటూ నినదిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఏలూరు టౌన్: ఏలూరులో మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



లింగపాలెం: కలరాయునగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు



కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



లింగపాలెం: లింగపాలెంలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ప్రచారం



నిడమర్రు: గుణపర్రులో ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబుకు పూల దండలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

క్లుప్తంగా

భారీగా తెలంగాణ మద్యం పట్టివేత



నిందితుడు, తెలంగాణ మద్యం సీసాలతో సెబ్ అధికారులు

నూజివీడు : మండలంలోని సుంకొల్లులో ఎస్ఈబీ అధికారులు సోమవారం భారీగా తెలంగాణ మద్యాన్ని పట్టివేశారు. ఎస్ఈబీ డీఎస్పీ జనార్దన్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఈబీ నూజివీడు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీ వెంకటరమణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున యనమదల వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా జీ కొండూరుకు చెందిన బల్లా పవన్‌కుమార్ ద్విచక్రవాహనంపై రెండు కేసుల తెలంగాణ మద్యం తీసుకెళుతూ పట్టుబడ్డాడు. దీంతో అతనిని విచారించగా సుంకొల్లులోని అతని మామ ఇంటి వద్ద మరో తెలంగాణ మద్యం 10 కేసులు ఉన్నట్లు తేలడంతో వాటితో సహా మొత్తం 576 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిఘా ఎక్కువగా ఉండటంతో మామ ఇంటి వద్ద కేసులు ఉంచి జీ కొండూరులో అమ్ముతున్నట్లు నిందితుడు తెలిపాడన్నారు. ఇతనిపై జగ్గయ్యపేటలో సైతం కేసు నమోదైందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువుకు చేయూత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదువులో రాణిస్తూ, ఆర్థిక కారణాల వల్ల చదువుకోలేని విద్యార్థులను ఆదరించాలనే లక్ష్యంతో స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని ఆ ట్రస్ట్ ప్రతినిధులు ఎ.సర్వేశ్వర రావు, టీ రూజ్‌వెల్ట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 525కు పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అనాథలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా చేయూత అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతిష్టాత్మకమైన నిట్ విద్యా సంస్థల్లో చదువుకోవడానికి అటువంటి విద్యార్థులకు సహకారం అందిస్తామన్నారు. దీని కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 525కు పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సీట్ (స్పృహ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్) పరీక్ష ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 7వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉందన్నారు. పరీక్ష ఈ నెల 11వ తేదీన ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ రాజమండ్రిలోని తిరుమల విద్యాసంస్థల్లో నిర్వహిస్తామన్నారు.

చంద్రబాబు ఎంతకైనా తెగిస్తాడు

బోడిగూడెంలో ప్రచారంలో పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



బోడిగూడెంలో వర్జీనియా పొగాకు తోరణంతో రాజ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళా రైతులు

కొయ్యలగూడెం : ఎన్నికల్లో లబ్ధి కోసం ఎంతటి నీచానికైనా మాజీ సీఎం చంద్రబాబు నాయుడు వెనుకాడబోడు అని పోలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి దుయ్యబట్టారు. కొయ్యలగూడెం మండలంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె తన భర్త ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడంతో మొదలుపెట్టిన చంద్రబాబు దుష్ట రాజకీయం ఇప్పుడు మహానేత వైఎస్సార్ కుటుంబాన్ని, కాపు ఉద్యమ నేత ముద్రగడ కుటుంబాన్ని, మంత్రి అంబటి కుటుంబాన్ని బజారుకీడ్చి రాక్షసానందం పొందుతున్నాడన్నారు. ప్రజాదరణ పొందిన కుటుంబాలలో ప్రజలకు ఉన్న విశేష ఆదరణను చూసి ఓర్వలేక ఇంటి ఆడపడుచులను పావులుగా వాడుతున్నాడని, దీనికి దత్తపుత్రుడు పవన్ వంత పాడుతున్నాడని ఎద్దేవా చేశారు. బోడిగూడెం గ్రామంలో మహిళా రైతులు వర్జీనియా పొగాకు తోరణాలతో గ్రామంలోకి ఆహ్వానిస్తూ రాజ్యలక్ష్మి ప్రచారానికి ఆకర్షణగా నిలిచారు. బర్కెట్‌నగర్, ఊట్లగూడెం, అంకాలగూడెం, రేపల్లెవాడ, కొయ్యలగూడెంలలో భారీ ఎత్తున ప్రచారం చేశారు. రెండు వందలకు పైగా మోటారు సైకిళ్ళు యాభై కి పైగా కార్లు తో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మిల గెలుపుకు నియోజకవర్గ ప్రజలు కంకణం కట్టుకున్నారని, యాభై వేల ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యే, లక్ష ఓట్ల మెజార్టీతో ఎంపీ గెలవడం ఖాయం అని పేర్కొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కొన్నంగుంటలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా పారదర్శకంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని, ప్రజలకు మంచి చేశాం కాబట్టే వైఎస్సార్ సీపీని ఎన్నికల్లో గెలిపించాలని కోరుతున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కొన్నంగుంట, కొత్తూరు, అమృతనగర్, బత్తులవారిగూడెంలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. అవే పథకాలు ఇంకా మరింత మెరుగ్గా కొనసాగాలంటే మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ హయాంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదన్నారు. నూజివీడు ప్రాంతంలో రాజధానిని ఏర్పాటు చేస్తామని చెప్పి ఇక్కడ చేయకుండా ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా గత ఐదేళ్ల కృషి చేశానని, ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధిని చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటం ఉదయరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు పామర్తి రాజా, ఆరేపల్లి రాంబాబు, మందాడ శివశంకర రావు, మందాడ స్వామి, బసవరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.300 కోట్లతో కొల్లేరు గ్రామాలను అభివృద్ధి చేశాం

దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి



కోటేశ్వరదుర్గాపురంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కొల్లేరు గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.300 కోట్లు ఖర్చు చేసిందని దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి చెప్పారు. సోమవారం ఏలూరు రూరల్ మండల కొల్లేరు గ్రామాల్లో అబ్బయ్యచౌదరి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు అడుగడుగునా హారతి ఇచ్చి స్వాగతం పలికారు. యువకులు భారీ గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. తిమ్మారావుగూడెం ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచ్ గుడిపూడి రఘు, ఎంపీటీసీ సభ్యులు బోడిగడ్ల కుమారి, శ్రీనివాస్‌తో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోటేశ్వరదుర్గాపురంలో అబ్బయ్యచౌదరికి సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ, నారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు గండి బాలకృష్ణతో పాటు గ్రామ పెద్దలు గుమ్మడికాయతో దిష్టితీసి ఆహ్వానించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మొండికోడు సర్పంచ్ వేజెళ్ల గోపాలకృష్ణంరాజు, గ్రామస్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. గుడివాకలంకలో మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు ఆధ్వర్యంలో సర్పంచ్ జయమంగళ ప్రభావతి, ఉప సర్పంచ్ రుక్మనందమహారాజ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు బలే బలరామయ్య, ఎంపీటీసీ సభ్యులు మోరు రజనితో పాటు యువకులు, మహిళలు అబ్బయ్యచౌదరికీ స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్ళలంకలో సర్పంచ్‌లు తోకల అమల, ఘంటసాల మహాలక్ష్మీరాజుతో పాటు ఎంపీటీసీ బలే సత్యప్రసాద్ ప్రచారంలో పాల్గొన్నారు. పైడిచింతపాడులో వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, సర్పంచ్ ముంగర తిమోతీతో పాటు ఎస్సీ పెద్దలు, బీసీ పెద్దలు ప్రచారంలో ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

టీడీపీ, జనసేనకు గుడ్‌బై

- వైఎస్సార్ సీపీలోకి భారీగా నాయకులు, కార్యకర్తల చేరికలు
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటూ ఆకాంక్ష



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు, మహిళలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించటాన్ని వ్యతిరేకిస్తున్నామని బీజేపీ అధిష్టానం బాహాటంగా చెబుతున్నా.. చంద్రబాబు మాత్రం నోరు విప్పటం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళనాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ నాయకులు, మహిళలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరగా, వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. తంగెళ్లమూడి బడామహాల్ ప్రాంతానికి చెందిన 100 మంది టీడీపీ కార్యకర్తలు పార్టీని వీడి ఎంబీ అబ్దుల్లా, ఎండీ సిరాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ మరోసారి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని, ఏలూరు అభివృద్ధికి తాను మరింత పట్టుదలతో పనిచేస్తూ మీ అందరికీ సేవ చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ సోదరులు, మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు సమక్షంలో..

బుట్టాయగూడెం: పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు సోమవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. బాలరాజు, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు వీరికి పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద గూటాల సొసైటీ అధ్యక్షులు సుంకర అంజిబాబు, ఎంపీటీసీ హరిరామకృష్ణ, నాయకులు జల్లేపల్లి శివరామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ మాజీ ఎంపీటీసీ కడుగుల తాతారావు, గంధం భాస్కరరావు, గంధం భుజంగరాజు, డాక్టర్ కొట్టేలు కొండబాబు తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు చెప్పారు.

వాసుబాబు సమక్షంలో..

నిడమర్రు: పెదనింద్రకొలనులో జనసేనకు చెందిన 50 మంది కార్యకర్తలు సోమవారం బువ్వనపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వాసుబాబు సమంక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పెదనింద్రకొలను సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివ వర్మ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. వీరికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న చేపడుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షతులై పార్టీలోకి చేరినట్లు పెదనింద్రకొలను జనసేన యువకులు చెప్పారు.



దుద్దుకూరులో పార్టీ కండువా కప్పి టీడీపీ నేతలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

దళితులకు సొంగా క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న



జంగారెడ్డిగూడెం: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కూటమి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కారణంగా చట్టసభకు పోటీ చేస్తున్న రోషన్ కుమార్ అంబేడ్కర్‌ను గౌరవించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసే సమయంలో షూ ధరించడం అతని అహంకారానికి నిదర్శనం అన్నారు. రాజ్యాంగ నిర్మాతనే గౌరవించని వ్యక్తి ఇంకా దళితులకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తాను చేసిన తప్పుకు దళిత సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నిర్వహించిన దళిత సమ్మేళనంలో దళిత నాయకులను కింద కూర్చోబెట్టడం టీడీపీ నేతల అహంకారానికి నిదర్శనం అన్నారు. దళిత జాతిలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని కించపరిచిన చంద్రబాబు బ్యాచ్‌కి దళితులంటే ఎప్పుడూ చిన్నచూపే అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు దళితులంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

ఓటమి భయంతోనే ఎంపీ అభ్యర్థి సునీల్ కారుపై దాడి

తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు ఓటమి భయంతోనే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని పంతగాని వెంకన్న అన్నారు. రంగాపురం వద్ద వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్ యాదవ్ వాహనంపై రాళ్లు రువ్వడం కూటమి నేతల దౌర్జన్యానికి నిదర్శనం అన్నారు. ప్రజా క్షేత్రంలో విజయం సాధించాలంటే ఓటర్ల మనసులు గెలవాలే కానీ భౌతిక దాడులకు పాల్పడడం సరికాదన్నారు. ఎన్నికల్లో గెలవలేమనే భయంతోనే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. కూటమి నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలకు వైసీపీ శ్రేణులు భయపడేది లేదన్నారు. రాష్ట్రానికి సంక్షేమ ప్రదాత జగనన్న నేతృత్వంలో మరోసారి పేదల ప్రభుత్వం రాబోతోందన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా సోమవారం ఒక వ్యక్తి నుంచి రూ.90 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. ఈ నగదు ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. తనిఖీలలో వీఆర్వో బాబురావు, పోలీసు సిబ్బంది కె.రామకృష్ణ, సూర్యనాయక్, ఏ.సుధీర్, ఎం.నాగార్జున పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గణపవరంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.1.01 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. భీమవరం వైపు నుంచి కారులో వస్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద ఈమొత్తం ఉండటంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఎఫ్‌టీ అధికారి తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేల కంటే ఎక్కువగా నగదును వెంట తీసుకువెళ్లరాదని అధికారులు సూచించారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని తాడువాయి మండలం గొల్లగూడెం గ్రామంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడెంలో రాయల గోపి అనే వ్యక్తి తన ఇంటికి పశువుల షెడ్డుకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నాడనే ఫిర్యాదుపై తమ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారని, ఈ తనిఖీల్లో గోపి విద్యుత్ అక్రమ వినియోగానికి పాల్పడుతున్నట్లు గుర్తించారన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రూ.112478 అపరాధ రుసుముగా, మరో రూ.7 వేలు జరిమానాగా విధించామని తెలిపారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది.. హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక జగజ్జీవన్ నగర్‌కు చెందిన బెల్లంకొండ గంగాభవానీ (27)కు ఎన్టీఆర్ జిల్లా మైలవనారికి చెందిన బెల్లంకొండ రాముతో 2011లో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. మగ సంతానం కోసం గంగాభవానీ భర్త రాము మానసికంగా, శారీరికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న జంగారెడ్డిగూడెం పుట్టింటికి వచ్చింది. 5వ తేదీన జంగారెడ్డిగూడెం వచ్చిన రాము భార్య గంగాభవానీతో మరలా గొడవ పడ్డాడు. మనస్థాపానికి గురైన గంగాభవానీ సోమవారం ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి రవిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ప్రశాంతంగా ఏపీ ఐసెట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించే ఏపీఐసెట్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాడేపల్లిగూడెం శ్రీవాసవీ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో పరీక్షకు 241 మంది, సాయంత్రం పరీక్షకు 231 మంది హాజరయ్యారు.

మేం నమ్ముతాం.. నిన్నే జగన్

- ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందించారు
- వైద్యసేవలు సైతం చేరువ చేశారు
- మెట్ట ప్రాంతంలోనూ పంటలు బాగా పండుతున్నాయి
- ఇంత మేలు చేసిన జగన్‌ను ఎలా మరిచిపోతాం?
- 'సాక్షి' రోడ్ షోలో ఉమ్మడి పశ్చిమగోదావరి వాసుల అంతరంగం

సాక్షి రోడ్ షో

ఒకప్పుడు రేషన్ కార్డు కావాలన్నా.. పింఛన్ పొందాలన్నా.. ధ్రువీకరణ పత్రాలు అవసరమైనా.. సొంతింటి కల నెరవేరాలన్నా.. ఎక్కే మెట్టు దిగే మెట్టు అనేట్టు ఉండేది. టీడీపీ నేతల కాళ్లకు మొక్కుతూ.. వారి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఆఖరికి చోటా మోటా నేతలు సైతం హుకుం ప్రదర్శించేవారు. జగనన్న పాలన వచ్చాక ఈ కష్టాలన్నీ ఒక్కసారిగా దూదిపింజల్లా తేలిపోయాయి. ఇంటింటికీ వలంటీర్ వచ్చి అర్హతలున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశారు. డాక్టర్ సైతం ఇంటికే వచ్చి వైద్యం అందిస్తుండటం విశేషం. ఇలాంటి పాలన ఇంతకుముందు ఎన్నడూ చూడలేదని, జగనన్న పాలనే మళ్లీ రావాలని ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు. చెప్పినవన్నీ చేశాడు.. ఇలాంటి సంక్షేమ పాలనకే మళ్లీ పట్టం కడతామంటూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 'సాక్షి రోడ్ షో'లో ఓటర్లు తమ మనోగతాన్ని పంచుకున్నారు. ఏలూరు నగరంలో ప్రారంభమై దెందులూరు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో ఓటర్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ వివరాలివీ..

– సాక్షి ప్రతినిధి, ఏలూరు


శ్రీరామవరంలోని రైతుభరోసా కేంద్రం

చంద్రబాబు ఎన్నెన్నో చెబుతాడు..

ఉదయం 8.10 గంటలకు దెందులూరులోని ప్రధాన సెంటరుకు చేరుకున్నాం. అక్కడ హోటల్‌లో కట్టా వెంకట సుబ్బారావు, ఎస్.ఆదినారాయణతో మాట కలిపాం... వారిద్దరూ సీనియర్ సిటిజన్లే.



సుబ్బారావు జగన్‌మోహన్ రెడ్డి గురించి ఉద్వేగంగా మాట్లాడారు. నా మనవరాలికి అమ్మ ఒడి, నా భార్యకు డ్వాక్రా రుణ మాఫీ వచ్చింది. మా లాంటి వాళ్లకే కాదు కులం, పార్టీ చూడకుండా అందరికీ మా ఊళ్లో మేలు జరిగింది. చంద్రబాబు ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఎన్నెన్నో మాటలు చెబుతాడు.. ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి అంటూ బిల్డప్ ఇస్తాడు.. కానీ పనులేమీ జరగవు. సంక్షేమ పథకాలు కూడా ఎంపిక చేసిన వారికే ఇస్తారు. జగన్ బాబు.. అలాంటివేమీ చూడడు. మా దగ్గర రోడ్లు బాగుపడ్డాయి. సచివాలయాలు కట్టారు. ఇంటింటికీ పథకాలు వచ్చాయి.

ఇంతకంటే ఎవరు చేస్తారు..
దెందులూరుకు చెందిన వెంకటేశ్వరరావు

ఉదయం 9.10 గంటలకు 8 కిలోమీటర్ల దూరంలోని శ్రీరామవరం చేరుకున్నాం. సాధారణంగా ఐ లవ్ ఏలూరు, ఐ లవ్ విజయవాడ అంటూ మున్సిపల్ కార్పొరేషన్‌లోనే వెల్‌కం బోర్డులుంటాయి. శ్రీరామవరం గ్రామంలో సైతం 'ఐ లవ్ శ్రీరామవరం' అంటూ శాశ్వత చిహ్నం ఏర్పాటు చేయడం విశేషం. దాని వెనుక వైపు పూర్తి జలకళతో గ్రామ చెరువు, దానికి ఎదురుగా అధునాతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ఉంది. అక్కడి నుంచి గ్రామ ప్రధాన సెంటరుకు చేరుకుని అక్కడ వెంకటేశ్వరరావుతో మాట్లాడగా వ్యవసాయం బాగుంది. ధాన్యం కొనుగోళ్లతో మేలు జరిగింది. గతంలో పంట ముందు అమ్మితే తక్కువ డబ్బులు, చివరిగా అమ్మితే ఎక్కువ డబ్బులు వచ్చేవి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం.. మా బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు పడుతుండటంతో ఎప్పుడైనా ఒకే రేటు వస్తోంది. దీంతో అందరికీ మంచి జరుగుతోంది. మొదటి ఏడాది చిన్న చిన్న సమస్యలున్నా.. ఆ తరువాత నుంచి బాగా జరిగింది. పంట సాగు చేసి రేటు వస్తుందో రాదోనని భయపడే స్థాయి నుంచి ఎంత డబ్బు వస్తుందో కచ్చితంగా అంచనా వేసే స్థాయికి వచ్చాం. రైతులకు ఇంతకంటే ఎవరు బాగా చేస్తారు?

అన్నీ చేస్తున్న జగన్‌ను ఎవరూ మరిచిపోరు
భీమడోలుకు చెందిన నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ


అందంగా ఏర్పాటు చేసిన శ్రీరామవరం స్వాగత బోర్డు



ఉదయం 11 గంటలకు ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండల కేంద్రానికి చేరుకున్నాం. సంత మార్కెట్ సెంటరులో నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ అనే చిరు సీజనల్ వ్యాపారి మాట్లాడుతూ.. మాకు కాపు నేస్తం, నా భార్యకు డ్వాక్రా రుణమాఫీ, ఇంటి స్థలం ఇలా అన్ని పథకాలూ వచ్చాయి. మా వలంటీర్ ఏ పథకానికి అర్హులమో చెప్పిమరీ అన్నింటికీ దరఖాస్తులు చేయించి మాకు పథకాలు అందించింది. నా భార్య చిన్నపాటి రుణంతో హోటల్ నడుపుకుంటోంది. నేను ఎండాకాలంలో సోడా బండి, వర్షాకాలంలో విత్తనాల వ్యాపారం, మిగిలిన సమయంలో కూలి పని, కొట్టాల్లో పనులు చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాం. పిల్లల పెళ్లిళ్లు అయ్యాయి. వారికి కూడా పథకాలు అందుతున్నాయి. కులం చూడకుండా అన్నీ చేస్తున్న జగన్‌ను మేమే కాదు, ఎవరూ మరిచిపోరు.

మెట్ట భూములకు రేటు పెరిగింది

అక్కడి నుంచి వెలమపేటకు చెందిన ఓ డాక్యుమెంట్ రైటర్ గతానికి, ఇప్పటికి తేడా చెప్పి.. ఇవి నేను చెబుతున్నది కాదు, మా దగ్గరకు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే రైతులే మాతో చెప్పిన మాట అని చెప్పారు. ద్వారకాతిరుమల మండలం భీమడోలులో కొంత భాగం మెట్ట ప్రాంతం. 2019కి ముందు ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.28 లక్షల చొప్పున పామాయిల్ తోటల ధరలు ఉండేవి. రెండు, మూడేళ్లగా పామాయిల్‌కు మంచి ధర రావడం, ప్రభుత్వమే బోర్లు వేయించడం, సబ్సిడీలు ఇవ్వడం, ఇతర పథకాలు ఇస్తుండటం, పోలవరం కాల్వ నీరు, భూగర్భ జలాలు బాగుండటంతో ఎకరం ఇప్పుడు రూ.45 లక్షల నుంచి రూ.48 లక్షలకు చేరింది. ఎక్కువగా రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న రైతులు మెట్ట ప్రాంతం వారే రేట్లు బాగా పెరిగాయని చెబుతున్నారు. మెట్ట భూములకు ఐదేళ్ల కాలంలో నూరు శాతం రేటు పెరిగిందంటే రైతులంతా ఎంత సంతోషంగా ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

స్కూళ్లు బాగుచేశారు

అక్కడి నుంచి కురెళ్లగూడెం, కైకరం మీదుగా నారాయణపురం చేరుకుని అక్కడ రైతులతో మాట్లాడగా.. ధాన్యం మద్దతు ధర బాగుంది. రేటు సమస్యే ఇక లేదు. దళారీల గోల లేకపోవడంతో మిగిలే సొమ్ము అంతా మాకే దక్కుతుంది.. అని చెప్పారు. అక్కడినుంచి 16 కిలోమీటర్ల మేర ప్రయాణించి మధ్యాహ్నం 1.30 గంటలకు తాడేపల్లిగూడెం చేరుకున్నాం. అక్కడ నుంచి యాగర్లపల్లిలో పెద్దిరాజు, రాముతో మాట కలిపాం. ఆయన చెప్పింది ఇదీ.. మా ఊళ్లో స్కూళ్లు బాగున్నాయి.. అంగన్‌వాడీల్లో కూడా మంచి ఆహారం పెడుతూ చదువుకు జగన్ బాగా ప్రాధాన్యత ఇస్తున్నారు. గవర్నమెంట్ స్కూళ్లు కూడా అందంగా తయారుకావడంతో పిల్లలందరూ స్కూళ్లకు ఆసక్తిగా వెళ్తున్నారు. మా కుటుంబంలో వ్యక్తిగతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

లంచం ఊసే లేదు

అక్కడ నుంచి తాలూకాఫీసు సెంటరులో పాన్ షాప్ యజమాని రాముతో మాట్లాడగా.. ఇంజనీరింగ్ చదువుతున్న కూతురికి విద్యాదీవెనతో పాటు పెద్ద కుమార్తెకు కళ్యాణమస్తు పథకంతో పాటు మా ఇంట్లో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఎక్కడా రూపాయి లంచం లేకుండా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయని చెప్పారు.

దాచుకున్న సొమ్ముతో పాడిగేదెలు కొన్నాం

అక్కడ నుంచి అలంపురం, దువ్వ మీదుగా తణుకుకు మధ్యాహ్నం 2.45 గంటలకు చేరుకుని నరేంద్ర సెంటర్, ఉండ్రాజవరం సెంటర్, హౌసింగ్ బోర్డుల్లో వృద్ధులు, మహిళలతో మాటమంతీ కలిపాం. పద్మావతి అనే మహిళ మాట్లాడుతూ మా కుటుంబంలో, పెళ్లి అయిన మా పిల్లలకు పథకాలు బాగా వచ్చాయి. ఎక్కడా రూపాయి అడగకుండా నేరుగా బ్యాంకుల్లో వేస్తున్నారు. దాచుకున్న సొమ్ముతో రెండు పశువులు కొని పాడి చేస్తున్నాం. మా ఇంటాయనతో పాటు నాకు కూడా ఆదాయం వస్తోంది అంటూ సంతోషంగా చెప్పింది.

కరెంట్ కష్టాలకు చెక్

- జిల్లాలో రూ.111.71 కోట్లతో 3 నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రూ.200.30 కోట్లతో మరో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం
- 18 మండలాల్లో తీరనున్న విద్యుత్ సమస్యలు


టి.నరసాపురం మండలం ఏపిగుంటలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన వరంగా మారింది. ఇప్పటికే రైతులకు వ్యవసాయం నిమిత్తం 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు గడిచిన ఐదేళ్లలో రైతులకు 5658.37 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేసింది. దీని కోసం రూ.354.47 కోట్లు వెచ్చించింది. అలాగే పేదల కోసం జగనన్న ఇచ్చిన ఇళ్లకు 300 కాలనీల్లో విద్యుత్ సరఫరా కోసం రూ.18.60 కోట్ల వ్యయంతో 8 సబ్‌స్టేషన్లను నిర్మించింది. దీనికి అదనంగా నూతనంగా 3 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసి గత నవంబర్‌లో ప్రజలకు అంకితం చేయగా మరో 2 సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. దీంతో 18 మండలాల్లోని ప్రజల విద్యుత్ కష్టాలు తీరనున్నాయి.

జిల్లాలో కొత్తగా 3 సబ్‌స్టేషన్ల నిర్మాణం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరాలో నెలకొన్న పరిస్థితులను మెరుగుపరచడానికి మొత్తం 5 సబ్‌స్టేషన్లు మంజూరు చేశారు. వీటిలో టి.నరసాపురం మండలం ఏపిగుంట గ్రామంలో 132/33 కిలోవాట్ల సామర్థ్యంతో రూ.60.20 కోట్ల నిధులతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. అలాగే ఉంగుటూరు మండలం నారాయణపురం (నల్లమాడు) గ్రామంలో 132/33 కిలోవాట్ల సామర్థ్యంతో రూ.22.62 కోట్ల నిధులతో, జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలో 132/33 కిలోవాట్ల సామర్థ్యంతో రూ.28.89 కోట్ల నిధులతో మరో విద్యుత్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. మొత్తం రూ.111.71 కోట్లతో నిర్మించిన ఈ మూడు సబ్‌స్టేషన్లను ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కాగా గణపవరం మండలంలో సరిపల్లి (కొత్తపల్లి) గ్రామంలో రూ.60.64 కోట్ల వ్యయంతో 132/33 కేవీ సబ్‌స్టేషన్, పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో భారీ స్థాయిలో 220/133/33 కేవీ సామర్థ్యంతో రూ.139.66 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.


నారాయణపురం (నల్లమాడు)లో విద్యుత్ సేవలు అందిస్తున్న సబ్‌స్టేషన్

లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారంగా..

జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని దశాబ్దాలుగా లో ఓల్టేజ్ విద్యుత్ సరఫరాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా వారి గృహాల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ట్యూబ్‌లైట్లు ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు తరచూ ఓల్టేజ్ హెచ్చుతగ్గులతో కాలిపోయి తీవ్రంగా నష్టపోయేవారు. ఇకపై వారికి లోఓల్టేజ్ కష్టాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయడాని నూతనంగా నిర్మించిన, నిర్మిస్తున్న ఈ సబ్‌స్టేషన్లు సేవలు అందించనున్నాయి. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా 18 మండలాల్లో సుమారు 11 లక్షల మంది కరెంట్ కష్టాలకు చెక్ పడనుంది.


ద్వారకాతిరుమలలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కంట్రోల్ రూమ్ భవనం

రాజకీయాల్లోకి వచ్చింది.. సేవ చేసేందుకే

సాక్షితో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు





ఉంగుటూరు నియోజకవర్గ చరిత్రలోనే రూ.2వేల కోట్లకు పైగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందించిన ప్రభుత్వం మాది. పేకాట శిబిరాలు, కోడిపందేలు, బెల్టు షాపులు, అసాంఘిక కార్యకలాపాలను అణిచివేశా. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నా. వైఎస్సార్ సీపీ శ్రేణుల సమష్టి కృషి, నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానం ఎన్నికల్లో మరోసారి తనకు భారీ విజయాన్ని అందిస్తాయని ఉంగుటూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

- నిడమర్రు

ప్రశ్న: మీరు రాజకీయాల్లోకి ఎలా వచ్చారు?

వాసుబాబు: తాతల కాలం నుంచి గ్రామ సర్పంచ్‌గా మా కుటుంబం సేవలందించింది. అదే నేపథ్యంలో అత్తిలి, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ గ్రామాల పరిధిలో ఉన్న గణపవరం సమితి అధ్యక్షునిగా మా నాన్నగారు ఏసుబాబు సేవలందించారు. ఆయన మరణానంతరం నేను బువ్వనపల్లి సర్పంచ్‌గా నాడు రాజకీయ ప్రవేశం చేశాను. జగన్‌మోహన్‌రెడ్డి తనతో నడవాలని కోరడంతో వైఎస్సార్ సీపీలో చేరాను. 2014 ఎన్నికల్లో పోటీచేసినపుడు స్వల్ప మెజార్టీతో ఓడినా.. 2019 ఎన్నికల్లో 33 వేలకుపైగా భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించారు.

ప్రశ్న: గడిచిన ఐదేళ్లలో మీ ప్రయాణం ఎలా సాగింది?

వాసుబాబు: 2014లో ఓటమి చెందినా దిగులు పడకుండా పార్టీ ఆదేశాల మేరకు ప్రజల్లోనే తిరిగా. ఏ గ్రామంలో ఏ సమస్య ఉందో పూర్తి అవగాహన ఉంది. నిరంతరం ప్రజలకు దగ్గరగా ఉండడంతో 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను గెలిపించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నా వంతు కృషి చేశాను. నేటికీ నన్ను గ్రామాల్లో ఎమ్మెల్యే వాసుబాబు కంటే ఏసుబాబుగారి అబ్బాయిగానే పెద్దలు పిలుస్తుంటారు.

ప్రశ్న: ఇప్పటివరకూ మీపై అవినీతి ఆరోపణలు లేవు. దీనిపై మీ స్పందన?

వాసుబాబు: ప్రజలకు కేవలం సేవ చేసేందుకే రాజకీయల్లోకి వచ్చాను తప్ప.. పదవిని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదించుకునేందుకు కాదు. నా ప్రత్యర్థులు సైతం ఈ విషయాన్ని ఒప్పుకుంటున్నారు. ఇటీవల లోకేష్, పవన్‌కళ్యాణ్ పర్యటనలో నియోజకవర్గంలోని సమస్యలు ప్రస్తావించారే తప్ప, నాపై ఎటువంటి అవినీతి ఆరోపణలు చెయ్యకపోవడం నా వ్యక్తిత్వానికి నిదర్శనం. ఇప్పటివరకూ గడిచిన రెండు ఎన్నికల్లో నా సొంత ఆస్తులే ఖర్చు చేశాను తప్ప ఇతరులనుంచి ఏమీ ఆశించలేదు.

ప్రశ్న: ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి తీసుకున్న చర్యలు ఏమిటి?

వాసుబాబు: ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.2వేల కోట్లకు పైగా సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టాం. వివిధ సంక్షేమ పథకాలే కాకుండా జగనన్న కాలనీల నిమిత్తం ఇళ్లస్థలాల సేకరణ, మౌలిక వసతుల కల్పన, లేఅవుట్ పూడిక వంటి వాటికి 13,627 మంది లబ్ధిదారులకు గాను రూ.271 కోట్లు నిధులు సమకూర్చాము. ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరైన చరిత్ర ఏ ప్రభుత్వంలో లేదు. నాడు కూలే పంచాయతీ భవనాలు ఉంటే ఇప్పుడు రూ.310 కోట్లతో 68 సచివాలయాలు, రూ.172 కోట్లతో 65 రైతు భరోసా కేంద్రాలకు, రూ.107 కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్స్ సమకూర్చాము. రూ.396 కోట్లతో 169 స్కూళ్లలో నాడు-నేడు పథకం కింద అభివృద్ధి కొనసాగుతోంది.

ప్రశ్న: కొల్లేరు కాంటూరు పరిధి విషయంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

వాసుబాబు: కొల్లేరు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణానికి హాని కలిగించే చర్యలు నియంత్రించేందుకు ప్లస్ కాంటూరుకి పైన 10 కిలోమీటర్ల పరిధి వరకూ ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రతిపాదించేందుకు ఇప్పటికే అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయం సేకరించారు. 5వ కాంటూరు పరిధిలో ఉన్న వ్యవసాయ భూములు ఉంటే వాటిలో సంప్రదాయ వ్యవసాయం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాము.

ప్రశ్న: ఆక్వాలో విద్యుత్ సబ్సిడీ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మీ స్పందన?

వాసుబాబు: చంద్రబాబు హయాంలో ఆక్వాలో విద్యుత్‌కు యూనిట్‌కి రూ.3.85 ఉండేది. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉన్నప్పుడు గణపవరం సభలో ఆక్వారంగంలో యూనిట్ ధర రూ.1.50కి తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే జగన్ అమలు చేశారు. ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీ సన్న, చిన్నకారు రైతులకే ఇవ్వాలనే అధికారుల సూచన మేరకు 5 ఎకరాల సాగుకే విద్యుత్ రాయితీ కుదించారు. 2022 మే 16న గణపవరంలో జరిగిన సభలోనే నా కోరిక మేరకు ఆక్వా జోన్‌లో ఉన్న 10 ఎకరాల్లోపు ఉన్న ఆక్వా రైతులకు యూనిట్ ధరను రూ.1.50గా సీఎం ప్రకటించారు. దీని వల్ల ప్రభుత్వానికి కొన్ని వందల కోట్లు నష్టమైనా నా మాటకు విలువ ఇవ్వడంపై సంతోషించా.

ప్రశ్న: గణపవరం మీటింగ్‌లో పవన్ నవ్వులపాలయ్యారంటా.. ఏంటది?

వాసుబాబు: ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి కనీస అవగాహన లేదని పవన్ విమర్శతోనే తెలుస్తోంది. 3 నెలలు క్రితమే రూ.2.20 కోట్లతో సీసీ రహదారి, సీసీ డ్రెయిన్ నిర్మాణం పూర్తిచేశాం. కూటమి అధికారంలోకి వస్తే ఆరోడ్డుపైన రోడ్డేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి గణపవరం మీటింగ్‌లో పవన్ నవ్వులపాలైయ్యారు.

ప్రశ్న: నియోజకవర్గ ప్రజలను మీరు కోరేది?

వాసుబాబు: రాష్ట్ర బడ్జెట్ మించి ఐదు వంతుల ఖర్చు అయ్యే సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ అమలుకు సాధ్యం కాని పథకాలతో కూటమి అభ్యర్థులు చంద్రబాబు డైరెక్షన్లో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా టీడీపీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను తొలగించిన చరిత్ర టీడీపీది. 2019లో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసి నేడు ఓటర్లును ఓట్లు అడుగుతున్నాము. విశ్వసనీయత గల సీఎంగా 2024 ఎన్నికల హామీల్లో జగన్ మరోసారి అవే నవరత్నాలను మరింతగా పెంచి అమలు చేసేందుకు కృషి చేస్తారు. మీ ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన తెచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని నియోజకవర్గ ప్రజలను కోరుతున్నా.

బీసీల సంక్షేమం.. వైఎస్సార్ సీపీ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్


జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

వీరవాసరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని నవుడూరు జంక్షన్‌లో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి అధ్యక్షతన సోమవారం రాత్రి నిర్వహించిన జయహో బీసీ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను తూచ తప్పకుండా అమలు చేసిన నేత సీఎం జగన్ ఒక్కరే అన్నారు. గోదావరి జిల్లాల్లో అత్యధికంగా ఉన్న శెట్టిబలిజ, కాపు కులస్తులు ఏకమై సీఎం జగన్‌కు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

బీసీ ద్రోహి చంద్రబాబు

ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో రెండు చక్రాల్లా ముందుకు సాగుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు బీసీ ద్రోహి అని అన్నారు. చంద్రబాబు బీసీలతో పాటు ఎస్సీలను కూడా అవమానపరిచి మళ్లీ బీసీలు, ఎస్సీల ఓట్లు అడగడానికి అమలు సాధ్యం కాని హామీలతో వస్తున్నాడు నమ్మకండన్నారు. బీసీ వర్గాలకు చెందిన నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులను తోకల కత్తిరిస్తామని హెచ్చరించి తీవ్ర అవమాన పరిచాడని మండిపడ్డారు. ఎస్సీల విషయంలో మరింత దుర్మార్గంగా వ్యవహరించారన్నారు.

జగన్‌కు అండగా నిలవాలి : రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్‌కు బడుగు, బలహీన వర్గాలు అండగా నిలవాలని లేకుంటే పేదలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక స్థానం కల్పించిన సీఎం జగన్‌ని జీవితంలో ఎప్పుడూ మరవరాదన్నారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాల, భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సుమారు 20 వేల మంది బీసీ సంఘీయులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బీసీ వర్గీయులంతా రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, సంచార జాతుల చైర్మన్ పెండ్ర వీరన్న, జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, కామన నాగేశ్వరరావు, కోడె యుగంధర్, గూడూరి ఓంకారం, కడలి ధర్మారావు, తిరుమాని ఏడుకొండలు, కోటిపల్లి బాబు, వీరవల్లి శ్రీనివాస్, కోడె శ్రీనివాస్, మానుకొండ ప్రదీప్‌కుమార్, వీరవల్లి రాధాకృష్ణ, పిల్లి వీరేశ్వరరావు, పిల్లి నరసింహమూర్తి, మోటుపల్లి గంగాధరరావు, బీసీ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.